రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అతి స్వల్ప కాలంలోనే అత్యధిక మంది పాఠకుల మన్ననలు పొందుతూ ముందుకు దూసుకెళ్తున్న క్విక్ టుడే దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

EDITOR: G.BUCHI REDDY
8125972476



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY తెలుగు దినపత్రిక






క్విక్ టుడే దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
8125972476



| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 122 | సోమవారం | 26-01- 2026 | వెల: 3 రూ./- | పేజీలు : 8 |
|---|---|---|---|---|---|---|
| MALKAJGIRI | Volume: 3 | Issue: 122 | Monday | 26-01- 2026 | Price: ₹3/- | Pages: 8 |


## ధర్మేంద్ర, వీఎస్ అచ్యుతానందన్ సహా

# ఐదుగురికి పద్మ విభూషణ్







మరణానంతరం ఇద్దరికి దక్కిన అత్యున్నత అవార్డులు

డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, మమ్ముట్టి సహ 13 మందికి పద్మభూషణ్ పురస్కారాలు

113 మందికి దేశ నాలుగో అత్యున్నత పద్మశ్రీ అవార్డులు

తెలుగు రాష్ట్రాల నుంచి 11మంది అవార్డులకు ఎంపిక


2026 పద్మ అవార్డులను ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ, జనవరి25:** భారత ప్రభుత్వం 2026 పద్మ అవార్డులను ప్రకటించింది. సామాజిక సేవ, కళలు, విద్య, వ్యవసాయం, సామాజిక సంక్షేమంలో చేసిన కృషిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం కొందరు ప్రముఖులకు పద్మ అవార్డులు ఇచ్చి సత్కరిస్తుంది. ఈ ఏడాది 5 మందికి దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మవి భూషణ్, 13 మంది మూడో అత్యున్నత పౌర పురస్కారం, 113 మందికి నాలుగో పౌర పురస్కారమైన పద్మశ్రీ అవార్డులు ప్రకటించింది. ఇటీవల కన్నుమూసిన బాలీవుడ్ నటుడు ధర్మేంద్రకు (కళలు) పద్మవిభూషణ్ ప్రకటించారు. ఎన్.రాజన్ (కళలు), కె.టి.థామస్ (సామాజిక సేవ), పి.నారాయణన్ (సాహిత్యం), వి.ఎస్. అచ్యుతానందన్ (మరణానంతరం) (సామాజిక సేవ)లను పద్మ విభూషణ్ అవార్డు వరించింది. డాక్టర్ నోరి దత్తాత్రేయుడుతో పాటు నటుడు మమ్ముట్టి

మిగతా 2లో

## శుభాంశు శుక్లాకు

# అశోకచక్ర



ఐఎస్ఎస్ వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామికి అత్యున్నత సాహస పురస్కారం

**న్యూఢిల్లీ, జనవరి 25:** భారత గగనతల యోధుడు, అంతరిక్షంలో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన వ్యోమగామి శుభాంశు శుక్లాను దేశం అత్యున్నత సైనిక పురస్కారం 'అశోక చక్ర'తో గౌరవించింది. శాంతి కాలంలో ఇచ్చే అత్యున్నత



## శాంతితోనే

# సురక్షితం

ప్రపంచ మానవాళికి భారత్ శాంతి సందేశం

న్యాయం, సోదరభావమే గణతంత్రానికి పునాదులు

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

దేశాభివృద్ధి ప్రయాణంలో మహిళలు కీలక మైలురాళ్లు

రాజ్యాంగ విలువలే ప్రభుత్వానికి మార్గదర్శకం

77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ, జనవరి26:** పలు ఖండాల్లో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో మానవాళి భవిష్యత్తును సురక్షితం చేయడానికి అత్యంత కీలకమైన శాంతి సందేశాన్ని భారత్ ప్రపంచానికి అందిస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు దేశం సిద్ధమవుతున్న వేళ, ఆదివారం సాయంత్రం ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ క్రమంలో శాంతికి దూతగా భారత్‌ను అభివర్ణించారు. ప్రపంచమంతటా శాంతి ఉంటేనే మానవాళి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే ఆపరేషన్ సిందూర్, మహిళా సాధికారత, వందేమాతరం, బలపడుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలను తన ప్రసంగంలో ముర్ము ప్రస్తావించారు. భారత ప్రజాస్వామ్య క్యాలెండర్‌లో అత్యంత ముఖ్యమైన ఈ వార్షిక ప్రసంగం దేశవ్యాప్తంగా కోట్లాది మంది పౌరులకు

మిగతా 2లో



## సింగరేణిలో

# భారీ అవినీతి

సీఎం రేవంత్ సూత్రధారి

సైట్ విజిట్ సర్టిఫికెట్ టెండర్లను రద్దు చేయాలి

నైనీ టెండర్ రద్దు చేయడమే అక్రమాలకు నిదర్శనం

సీబీఐ విచారణ జరపాలని హరీశ్ రావు డిమాండ్

కార్మికుల బోనస్ తగ్గించారని విమర్శ

**హైదరాబాద్, జనవరి25 (క్విక్ టుడే న్యూస్):** సింగరేణి కాలరీస్‌లో భారీ అవినీతి జరిగిందని, ఈ కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని, ఆయన బావమరిది

మిగతా 2లో

## టీ20 సిరీస్

# భారత్‌దే

మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చిత్తుగా ఓటమి

కేవలం 10 ఓవర్లలోనే ఛేదించిన లక్ష్యం

విధ్వంసకర బ్యాటింగ్ చేసిన అభిషేక్ వర్మ



**గువాహటి, జనవరి25:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 లో టీమిండియా వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది. గువహటిలోని బర్సపరా క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మూడో టీ20లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో అద్భుత ప్రదర్శనతో సిరీస్‌ను సొంతం చేసుకుంది. తొలుత బౌలింగ్‌లో న్యూజిలాండ్‌ను 153 పరుగులకే కట్టడి

మిగతా 2లో



## రెస్క్యూ..

# రిస్క్

సెల్లార్ నుంచి ఐదు మృతదేహాలను వెలికి తీసిన రెస్క్యూ బృందాలు

22 గంటలపాటు శ్రమించిన ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్, హైడ్రా, ఫైర్ సిబ్బంది

సెల్లార్ అగ్నిప్రమాదంలో చిక్కుకున్న ఐదుమంది ఆహుతి

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున పరిహారం

ఫర్నిచర్ ఓనర్‌పై క్రిమినల్ చర్యలు

## సౌత్ సినీ ఇండస్ట్రీకి

# పద్మ అవార్డుల పంట

తెలుగు హీరోలు మురళీమోహన్, డాక్టర్ రాజేంద్రప్రసాద్‌లకు పద్మశ్రీ అవార్డులు

దివంగత నటుడు ధర్మేంద్రకు పద్మవిభూషణ్, మమ్ముట్టి కి పద్మ భూషణ్

8

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

సోమవారం 26 జనవరి 2026

quicktodaynews.com



తరువాయి పేజీ..





# టీ20 సిరీస్ భారత్‌దే

చేసిన భారత్, అనంతరం బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ విధ్వంసక హాఫ్ సెంచరీలతో కేవలం 10 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. 154 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు తొలి బంతికే షాక్ తగిలింది. ఓపెనర్ సంజూ శాంసన్ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. అయితే ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ (13 బంతుల్లో 28), మరో ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి ఎదురుదాడికి దిగాడు. వీరిద్దరూ కేవలం 19 బంతుల్లోనే 53 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇషాన్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, అభిషేక్‌తో కలిసి విధ్వంసం సృష్టించాడు. తన పరుగుల దాహాన్ని తీర్చుకుంటూ కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సూర్య 26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 57 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. అభిషేక్ శర్మ కూడా కేవలం 20 బంతుల్లోనే 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 68 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 40 బంతుల్లోనే 102 పరుగులు జోడించడం విశేషం. అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్, కివీస్‌ను ఆది నుంచే దెబ్బతీసింది. భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ 34 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో గ్లెన్ ఫిలిప్స్ (40 బంతుల్లో 48), మార్క్ చాప్‌మన్ (23 బంతుల్లో 32) నాలుగో వికెట్‌కు 52 పరుగులు జోడించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే ఈ భాగస్వామ్యాన్ని రవి బిష్ణోయ్ విడదీయడంతో కివీస్ మళ్లీ కుప్పకూలింది. చివర్లో కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (17 బంతుల్లో 27) కాస్త రాణించడంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో కేవలం 17 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. రవి బిష్ణోయ్, హార్దిక్ పాండ్యా చెరో రెండు వికెట్లు తీసి కివీస్ పతనాన్ని శాసించారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా, సిరీస్‌ను కైవసం చేసుకుంది. నామమాత్రంగా మిగిలిన చివరి రెండు మ్యాచ్‌లలో బెంచ్ బలాన్ని పరీక్షించే అవకాశం ఉంది.

# సింగరేణిలో భారీ అవినీతి

సృజన్ రెడ్డి ప్రధాన లబ్ధిదారుడని హరీశ్ రావు ఆరోపించారు ఆరోపణలు చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధనతో జారీ చేసిన టెండర్లన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.




ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ కుంభ కోణ ంపై జ్యుడీషియల్ లేదా సీబీఐ విచారణ జరపాలని కోరారు. నైనీ టెండర్‌ను రద్దు చేయడమే ఇందులో తీవ్ర అక్రమాలు జరిగాయనడానికి నిదర్శనమని అన్నారు. సీఎంకు సన్నిహితులైన కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే టెండర్ నిబంధనలను మార్చారని విమర్శించారు. జనవరి 2025లో ఎలాంటి సైట్ విజిట్ నిబంధన లేకుండా అంచనా వ్యయం కంటే 7 శాతం తక్కువకు ఖరారైన భూపాలపల్లి పనుల టెండర్లను, మూడు నెలల్లోనే మే 2025లో కొత్త నిబంధనలతో ఎందుకు జారీ చేశారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ మార్పుల వల్ల పోటీ తగ్గి, సీఎం బంధువుకు చెందిన కంపెనీకి అంచనా కంటే ఎక్కువ ధరకు పనులు అప్పగించారని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానంతో మొదటి లబ్ధి పొందింది సృజన్ రెడ్డికి చెందిన 'శోధా కన్‌స్ట్రక్షన్స్' అని ఆయన పేర్కొన్నారు. అవినీతిపై సూటిగా సమాధానం చెప్పకుండా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధం లేని పత్రాలు చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. కుంభకోణానికి బాధ్యులెవరు, ఎంత నష్టం వాటిల్లింది, ఎవరు లబ్ధి పొందారనే మూడు ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. సింగరేణికి వచ్చిన సుమారు రూ. 6,900 కోట్ల లాభాలను కాంగ్రెస్ ప్రభుత్వం దాచిపెట్టి, కార్మికుల బోనస్‌ను తగ్గించిందని కూడా ఆయన ఆరోపించారు. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఈ అవినీతిపై మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందని, సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి పనిచేస్తున్నాయని అన్నారు.

# శాంతితోనే సురక్షితం

చేరింది. ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభమైన ఈ ప్రసంగాన్ని ఆకాశవాణి జాతీయ నెట్‌వర్క్‌తో పాటు అన్ని దూరదర్శన్ ఛానెళ్లలో ప్రసారం చేశారు. మొదట హిందీలో, ఆ తర్వాత ఆంగ్లంలో రాష్ట్రపతి ప్రసంగించారు. దీనివల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు తమ మాతృభాషలో రాష్ట్రపతి సందేశాన్ని వినే అవకాశం కలిగింది. న్యాయం, సోదరభావం అనే రెండు కీలకమైన అంశాలను మన రాజ్యాంగం నిర్వచించిందని, అవే గణతంత్రానికి పునాదులని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దార్శనికత, రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. దేశాభివృద్ధి ప్రయాణంలో మహిళలు కీలక మైలురాళ్లను సృష్టిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నారని రాష్ట్రపతి ప్రశంసించారు. దేశ భద్రతకు కాపలా కాస్తున్న సాయుధ బలగాల శౌర్య పరాక్రమాలను కొనియాడుతూ, 'ఆపరేషన్ సిందూర్'ను ఆమె గుర్తుచేశారు. దేశ పురోభివృద్ధికి దోహదపడుతున్న రైతులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, సైనిక, పోలీసు సిబ్బంది, వ్యాపారవేత్తలు, యువత సేవలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం ప్రపంచంలోని డిజిటల్ లావాదేవీల్లో సగానికి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుదలను ముర్ము ప్రశంసించారు. ఈ పటిష్ఠతకు లోతైన నిర్మాణాత్మక సంస్కరణలు, ఆత్మనిర్భరత పట్ల నిబద్ధతే కారణమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, సమీప భవిష్యత్తులో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా భారత్ దూసుకెళ్తోందన్నారు. తన ప్రసంగంలో జాతీయ గేయం వందేమాతరం గురించి కూడా ముర్ము ప్రస్తావించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో వందేమాతరం భాషా హద్దులను దాటి ప్రజలను ఏకం చేసిందని తెలిపారు. వివిధ భారతీయ భాషల్లోకి ఈ గేయం అనువాదం అయ్యి ప్రాచుర్యం పొందిందని గుర్తు చేసుకున్నారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడానికి ఎన్నికలలో పాల్గొనడం పౌరుల బాధ్యత అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్



బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన సందేశాన్ని రాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేశారు. వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలతో పాటు సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లకు నివాళులర్పించిన కార్యక్రమాలను కూడా ఆమె ప్రస్తావించారు. గణతంత్ర భారతదేశం ఆవిర్భవించిన తొలి నాళ్ల నుంచి రాష్ట్రపతి ప్రసంగం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఇది దేశ ప్రగతి, విజయాలు, సవాళ్లను సమీక్షించుకోవడానికి ఒక అవకాశంగా నిలుస్తుంది. 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన చారిత్రక రోజుకు గుర్తుగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆ రోజునే మన దేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్రంగా అవతరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ప్రసంగం, జనవరి 26 వేడుకలకు స్ఫూర్తిదాయకంగా జాతినుద్దేశించి ప్రసంగిస్తారు.



## ధర్మేంద్ర, వీఎస్ అచ్యుతానందన్ సహా
# ఐదుగురికి పద్మ విభూషణ్

సహా 13 మందిని పద్మ భూషణ్ వరించింది. కేంద్ర ప్రభుత్వం ఆదివారం సాయంత్రం (జనవరి 25, 2026) పద్మ అవార్డు గ్రహీతల జాబితాను విడుదల చేసింది. పద్మభూషణ్, పద్మవిభూషణ్ గ్రహీతల జాబితాను సైతం కేంద్రం విడుదల చేసింది.

### 13 మందికి పద్మభూషణ్ పురస్కారం..

సింగర్ అల్కా యాగ్నిక్, ఉత్తరాఖండ్ మాజీ సీఎం భగత్ సింగ్ కోష్యారీ, నటుడు మమ్ముట్టి సహా 13 మందికి దేశ మూడో అత్యున్నత పౌరపురస్కారం పద్మభూషణ్ అవార్డు ప్రకటించారు. కల్లిపట్టి రామసామి పళనిస్వామి, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, పీయూష్ పాండే (మరణానంతరం), జార్ఖండ్ మాజీ సీఎం శిబు సోరెన్ (మరణానంతరం), వీకే మల్హోత్రా (మరణానంతరం), ఉదయ్ కోటక్, ఎస్‌కేఎం మైలానందన్, శతావధాని ఆర్ గణేష్, వెల్లపల్లి నటేశన్, విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్ పురస్కారంతో కేంద్రం గౌరవించింది.

### సీఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు

పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపికైన ప్రముఖులందరికీ సీఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడుకి పద్మభూషణ్ పురస్కారం లభించగా, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి గడ్డమణుగు చంద్ర మౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయానంద్ రెడ్డి, పశుసంవర్ధక రంగంలో మామిడి రామా రెడ్డి, విద్యా–సాహిత్య రంగాల నుంచి మామిడాల జగదీశ్ కుమార్, వెంపటి శశిశేఖర్, వెంపటి కుటుంబ శాస్త్రి, కళా రంగం నుంచి దీపికా రెడ్డి, మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ లకు పద్మశ్రీ పురస్కారాలు దక్కినందుకు ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. సేవా, కళా తదితర రంగాల్లో వారు అందించిన విశిష్ట సేవలు, అంకితభావాన్ని గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపిక చేశారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి గారు పర్యటన ముగించుకొని రాష్ట్రానికి తిరిగివచ్చిన అనంతరం పద్మ పురస్కారాలకు ఎంపికైన ప్రముఖులను ఘనంగా సన్మానించనున్నారు.

### తెలుగు వారికి పద్మశ్రీ

1.చంద్రమౌళి గడ్డమణుగు – తెలంగాణ – సైన్స్ అండ్ ఇంజినీరింగ్
2. దీపికా రెడ్డి – తెలంగాణ – కళ
3. గద్దె బాబు రాజేంద్రప్రసాద్ – ఆంధ్రప్రదేశ్ – కళ
4. గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్( మరణానంతరం) – ఆంధ్రప్రదేశ్ – కళ
5. గూడురు వెంకట్రావు – తెలంగాణ – వైద్యం
6. కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్ – తెలంగాణ – సైన్స్ అండ్ ఇంజినీరింగ్
7. కుమారస్వామి త్యాగరాజన్ – తెలంగాణ– సైన్స్ అండ్ ఇంజినీరింగ్8. మాగంటి మురళీ మోహన్ – ఆంధ్రప్రదేశ్ – కళ
9. పాలకొండ విజయ్ ఆనంద్ రెడ్డి – తెలంగాణ – వైద్యం
10. రమారెడ్డి మామిడి(మరణానంతరం) – తెలంగాణ
11. వెంపటి కుటుంబ శాస్త్రి – ఆంధ్రప్రదేశ్ – సాహిత్యం

# రెస్క్యూ.. రిస్క్

**సెల్లార్ నుంచి ఐదు మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ బృందాలు**

**22 గంటలపాటు శ్రమించిన ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్, హైడ్రా, ఫైర్ సిబ్బంది**

**సెల్లార్ అగ్నిప్రమాదంలో చిక్కుకున్న ఐదుమంది ఆహుతి**

**మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున పరిహారం**

**ఫర్నిచర్ ఓనర్‌పై క్రిమినల్ చర్యలు**



హైదరాబాద్, జనవరి25 (క్విక్ టుడే న్యూస్):

నాంపల్లిలోని ఫర్నిచర్ దుకాణంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో సుమారు 22 గంటలపాటు శ్రమించి భవనంలో చిక్కుకున్న ఐదు మృతదేహాలను రెస్క్యూ బృందాలు వెలికితీశాయి. చిన్నారులు ప్రణీత్, అఖిల్‌తో పాటు బీబీ, ఇంతియాజ్, హబీబ్ మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. భవనం లోపల చిక్కుకున్నవారిని రక్షించేందుకు సుమారు 200 మంది సిబ్బంది శ్రమించారు. వీరిలో ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్, హైడ్రా, ఫైర్, పోలీస్, జీహెచ్ఎంసీ విభాగాల సిబ్బంది ఉన్నారు. సహాయక చర్యలను డీసీపీ శిల్పవల్లి పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. విగతజీవులా కనిపించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. చిన్నారులు ప్రణీత్, అఖిల్ అమ్మమ్మ, నాన్నమ్మలు లబోదిబోమంటున్నారు. మొన్నటివరకు తమతోనే కలిసి సరదాగా గడిపారని ఇంతలోనే ఇలాజరిగిపోయిందని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. హబీబీ,ఇంతియాజ్, బీబీల కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాదం అత్యంత దురదృష్టకరమని, ఘటనలో ఐదుగురు మరణించడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. ఫర్నిచర్ షాప్ యాజమానికి భవనంలోని రెండు సెల్లార్లలో భారీగా ఫర్నిచర్‌ను నిల్వ ఉంచడం వలన ప్రమాదం తీవ్రత పెరిగిపోయిందని పోలీసులు, ఫైర్ సెఫ్టీ అధికారులు భావిస్తున్నారు. పార్కింగ్ కోసం ఉపయోగించాల్సిన సెల్లార్లలో ఫర్నిచర్ ఎందుకు నిల్వచేయాల్సి వచ్చింది ఇందుకు అనుమతి ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. భవనం సెల్లార్‌లో మంటలు ఎలా వ్యాపించాయి కారణాలేంటి? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిబంధనలు పాటించకపోవడం వల్లనే ఇలాంటి ప్రమాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అగ్నిమాపక దళం డీజీ విక్రమ్‌మాన్‌సింగ్ తెలిపారు. నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఫర్నిచర్ షాప్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని పొన్నం ప్రకటించారు. ఫైర్ సేఫ్టీ కి సంబంధించి నిబంధనలు పాటించకుండా ఘటనకు కారణమైన షాపు యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు.

